ప్రజాశక్తి

మంగళవారం 16 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వార్త మెయిన్‌లో..

శ్రామిక ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అజశర్మ, అనిల్, కుమార్ తదితరులు

27 నుంచి జనవరి 2 వరకు

శ్రామిక ఉత్సవ్

- బుక్ ఫెస్టివల్, సైన్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్లు సహా సాంస్కృతిక ప్రదర్శనలు
- ప్రతి రోజూ సినీ ప్రముఖులు హాజరు

భారత్ - శ్రీలంక

మహిళల టి20 టికెట్ల విక్రయం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్ - శ్రీలంక మహిళల టి 20 అంతర్జాతీయ సిరీస్‌లో భాగంగా ఈ నెల 21, 23 తేదీలలో విశాఖలోని ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగనున్న ద్వైపాక్షిక సిరీస్‌కు సంబంధించిన సందడి విశాఖలో ప్రారంభమైంది. ఈ రెండు మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్ల విక్రయం సోమవారం నుంచి ప్రారంభమైంది. బుకింగ్ ప్రక్రియను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించారు. టికెట్లను కొనుగోలు చేయాలనుకునే అభిమానులు కేవలం 'డిస్ట్రిక్ట్ బై (జోమటో)' మొబైల్ అప్లికేషన్ ద్వారా మాత్రమే వాటిని బుక్ చేసుకోవాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. స్టేడియం బాక్సాఫీస్ వద్ద నేరుగా టికెట్లు అమ్మకానికి ఉండవని పేర్కొన్నారు. సామాన్య ప్రేక్షకుల నుంచి ప్రీమియం కేటగిరీ వరకూ అందరికీ అందుబాటులో ఉండేలా టికెట్ ధరలను నిర్ణయించామన్నారు. వీటి ధరలు రూ.200, రూ.300, రూ.350, రూ.400గా ఉన్నాయని తెలిపారు. అనుకూల ధరల నిర్ణయం వల్ల ఎక్కువ మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చి మహిళల జట్లను ప్రోత్సహించే అవకాశం ఉందన్నారు. హోం గ్రౌండ్‌లో భారత మహిళల జట్టు శ్రీలంకను ఎదుర్కోబోతుండటం వల్ల ఈ సిరీస్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ క్రికెట్‌లో వేగంగా ఎదుగుతున్న మహిళల జట్లలో భారత్ ఒకటిగా ఉంది. విశాఖపట్నం నగరంలో మరిన్ని అంతర్జాతీయ క్రికెట్ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఈ సిరీస్ ఒక మంచి అవకాశం కల్పిస్తుందని ఎసిఎ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

భూ కబ్జాలపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భూకబ్జాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటిని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేక దృష్టి పెట్టి పరిశీలించారు. ఆనందపురం మండలం రామవరం పంచాయతీ, గంగసాని అగ్రహారం గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ గ్రామ కంఠం భూమిని దురాక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామ వాసి అమరపల్లి నరేష్, పలువురు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా కలిసిన 'ప్రజాశక్తి' ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజన మిగతా 2లో..

క్రీడా ప్రాంగణం, ఆడిటోరియం స్వాధీనం

చర్యలకు ఉపక్రమించిన విశాఖ పోర్టు

ప్రజాశక్తి - సీతమ్మధార / ఎంవిపి.కాలనీ : సాలిగ్రామపురంలో ఉన్న నెహ్రూ క్రీడా, సాంస్కృతిక సముదాయంలోని క్రీడా సముదాయం, కళావాణి ఎసి ఆడిటోరియంపై ఉన్న లీజు ఒప్పందాలను రద్దు చేసిన నేపథ్యంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ సోమవారం వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇక్కడి క్రీడా సముదాయాన్ని గతంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, కళావాణి ఆడిటోరియాన్ని విశ్వనాథ్ అవెన్యూస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, మిగతా 2లో..

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు న్యాయం చేయాలి

వార్త 2లో..

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

వార్త 5లో..

వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

వార్త 8లో..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

- ప్రజలు అన్నీ గుర్తిస్తున్నారు
- వైసిపి ర్యాలీల్లో కన్నబాబు, బూడి, అమర్‌నాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత ప్రభుత్వ హయాంలో తలపెట్టిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయవద్దని రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారని, తమ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంతో ఇది రుజువైందని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. విశాఖ జిల్లాలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన సంతకాల పత్రాల వాహనాన్ని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించడంలో భాగంగా సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు నాయకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను వాహనాలలో గాంధీ విగ్రహం వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నడపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, నియోజకవర్గాల సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మళ్ల విజయ ప్రసాద్, మిగతా 2లో..

విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

మహిళ సంపన్నురాలు కావాలన్నదే లక్ష్యం

- ప్రతి జిల్లాకు రూ.5 కోట్లతో క్లస్టర్
- సరస్ ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఉన్న ప్రతి మహిళా సంపన్నురాలు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొనారు. దానిలో భాగంగానే ప్రతి జిల్లాలో రూ.5 కోట్లతో క్లస్టర్ విధానం తీసుకొస్తామని, రూ.10 కోట్లతో కామన్ స్పెసిలిటీ సెంటర్ నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ కల్పించే ఉద్దేశంతోనే సరస్ వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని గుర్తు చేశారు. ఇటీవల విజయనగరంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ద్వారా రూ.12 కోట్ల వ్యాపారం జరిగిందని, అంతకంటే ఎక్కువగా విశాఖలో మార్కెట్ జరిగే విధంగా ఏర్పాట్లు చేశామని, చర్యలు తీసుకున్నామని ఉద్ఘాటించారు. డిఆర్‌డిఎ, సెర్ప్ ఆధ్వర్యంలో విశాఖలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన సరస్ ఎగ్జిబిషన్ (అఖిల భారత డ్వాక్రా బజార్ - 2025)ను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్, విజయనగరం డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జునలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ క్రమంలో వివిధ స్టాళ్లను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం అదే ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడే విధంగా బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వారి సరుకులకు, వస్తువులకు మంచి మార్కెట్ కల్పించే ఉద్దేశంతోనే ఇలాంటి సరస్ ఎగ్జిబిషన్లు చేపడుతున్నామన్నారు. మైక్రో ఇండస్ట్రీకి తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రిపెన్యూర్ నినాదంలో భాగంగా అందరూ భాగస్వామ్యమై ఆర్థికంగా స్వయం సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. 18 నెలలుగా స్వయం సహాయక సంఘాలు మంచి ఉత్సాహంతో పని చేస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ సరస్‌లో 250 స్టాళ్ల మిగతా 2లో..

ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి శ్రీనివాస్

మొదటి పేజీ తరువాయి..

క్రీడా ప్రాంగణం, ఆడిటోరియం స్వాధీనం

సంబంధిత లీజు ఒప్పందాల్లో పేర్కొన్న నిబంధనలు, షరతులను సదరు సంస్థ పాటించకపోవడంతో లీజు ఒప్పంద నిబంధనల ప్రకారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సెప్టెంబర్ 11న లీజు రద్దు నోటీసులు జారీ చేసింది. అనంతరం అవసరమైన ప్రక్రియ పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారుల సమక్షంలో సోమవారం వాటిని స్వాధీన పరుచుకుంది. పోర్టు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

మురళి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, చింతలపూడి వెంకటరామయ్య, సిరమ్మ, డిప్యూటీ మేయర్ కటుమూరు సతీష్, మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రింగ్ రోడ్డు జంక్షన్ నుండి నెహ్రూచౌక్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పుస్తకాలను తాడేపల్లికి ప్రత్యేక వాహనంలో తరలించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్తలు కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, మలసాల భరత్ కుమార్ తదితరులు ర్యాలీకి నాయకత్వం వహించారు. అనకాపల్లి జిల్లా నాలుగు లక్షల మంది సంతకాలు చేశారని అమర్‌నాథ్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కుమార్ రాజా, బుజ్జిబాబు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, కేఎం నాయుడు, బొడ్డేడ శివ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం : మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకగా వైసిపి అనకాపల్లిలో నిర్వహించిన ర్యాలీకి చోడవరం మండలం నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వారికి వైసిపి చోడవరం పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య అభినందనలు తెలిపారు.

భూ కబ్జాలపై ఫిర్యాదులు

ఉద్దేశంతోనే ఈ ఫిర్యాదు చేశామన్నారు. తమ గ్రామ పరిధిలోని గ్రామ కంఠం (ప్రభుత్వ) భూమి, సర్వే నెంబర్1లో కొంతకాలంగా ఎర్ర ఎర్రినాయుడు, గంగి రెడ్ల వీరన్న తదితరులు సుమారు ఆరు సెంట్ల స్థలంలో ఇల్లు, ఇంకా మూడు సెంట్ల స్థలంలో రేకుల షెడ్లు వేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయం గురించి గతంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, సంబంధిత విఆర్ఓ, ఎంఆర్ఓ తదితర అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేయగా, వారు అప్పట్లో కొంతవరకు చర్యలు తీసుకొని ఆయా నిర్మాణాలను నిలిపివేశారన్నారు. తరువాత మళ్లీ అదే అధికారులు వారితో కుమ్మక్కై, ఆ ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సహకరించినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించినప్పుడు, తమను బెదిరించే విధంగా మాట్లాడటమే కాకుండా అధికారులు అండ వారికి ఉందని విర్రవీగుతున్నారని తెలిపారు.

ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్

భూముల కబ్జాలపై రానురాను జిల్లా గ్రీవెన్స్‌కు వస్తున్న ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూలో పని తీరు రాష్ట్ర వ్యాపితంగా సరిగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో చేపట్టిన గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై స్వయంగా కలెక్టరే పరిశీలన చేయడం కనిపించింది. ల్యాప్ టాప్‌ను తన వద్ద పెట్టుకుని ఫిర్యాదుదారులు చెప్పే సమస్య, సర్వే నెంబర్ చూస్తూ జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలకు, మునిసిపల్ అధికారులకు స్వయంగా సమస్యను తెలపడం కనిపించింది..

వివిధ సమస్యలపై 299 వినతులు

విశాఖ కలెక్టరేట్ : పిజిఆర్ఎస్‌కు ప్రజలు వివిధ సమస్యలపై 299 వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 132 ఉండగా, జివిఎంసి 76, పోలీస్ విభాగానికి సంబంధించినవి 24, ఇతర విభాగాలకు చెందినవి 67 ఉన్నాయి.

మహిళ సంపన్నురాలు కావాలన్నదే లక్ష్యం

కొలువుదీరాయని తెలిపారు. నాబార్డు వాళ్లు కూడా ప్రోత్సాహం అందించారన్నారు. వస్తుత్పత్తుల స్టాళ్లతో పాటు ఫుడ్ స్టాళ్లు కూడా పెట్టామని, ప్రజలకు ఆహ్లాదం అందించేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా వివిధ బ్యాంకర్లకు, దాతలకు అతిథుల చేతుల మీదుగా సత్కారం చేసి జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

విశాఖ ఐఐఎంకి మూడు ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డుల్లో ఒకే ఏడాది మూడు బహుమతులను గెలుచుకుంది. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా వ్యూహాత్మక వినియోగంలో సంస్థ చూపిన అద్భుత ప్రతిభకు ఈ గుర్తింపు లభించింది. డెహ్రాడూన్‌లో జరిగిన పిఆర్ఎస్ఐ అవార్డుల కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం ప్రథమ బహుమతి, ఈ-న్యూస్‌లెటర్‌లో ద్వితీయ బహుమతి, కార్పొరేట్ ప్రచారంలో సోషల్ మీడియా ఉత్తమ వినియోగంలో తృతీయ బహుమతులను సాధించింది. ఉత్తరాఖండ్ శాసనసభ స్పీకర్ రితు ఖండూరిభూషన్, ఎంపి రమేష్ పోఖ్రియాల్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధి ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడారు.

ఆకట్టుకున్న సిఐటియు ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభ విశాఖలో జరుగనున్న నేపథ్యంలో జగదాంబ జంక్షన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అందరినీ ఆలోచింపజేసింది. ఈ నెల 27 వరకు విశాఖపట్నంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల వద్ద, ముఖ్యమైన కార్మిక కూడళ్ల వద్ద కార్మిక పోరాటాలను, ఉద్యమ ప్రస్థానాన్ని తెలియజేసే విధంగా అనేక విషయాలను పొందుపరుస్తూ ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రతిరోజూ నగర పరిధిలో ఒక్కొక్క ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. 27 నుంచి జనవరి 2 వరకు ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దీన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్మికులు, ప్రజలు తిలకించాలని కోరారు. దాదాపు 40 నుండి 50 ప్రేములతో ఎగ్జిబిషన్ తయారు చేయబడిందన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు అనేక వివరాలను అందులో పొందుపరిచామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా కోశాధికారి ఎస్.జోతీశ్వరరావు, వై.రాజు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ సెంటర్‌లో ఉద్యమ ఘట్టాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎం)కు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి సిఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఎల్.చైతన్య, ప్రధాన కార్యదర్శి పి.గణపతిరావు మాట్లాడుతూ సిఆర్ఎం పోస్టులకు ఎ - క్లస్టర్, బి - క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని, పాత పద్ధతిలోనే కొనసాగించాలని అన్నారు. మినిమం టైమ్ స్కేల్ అమలుచేసి, వేతనాలు పెంచాలన్నారు.

తమను విద్యా శాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కచ్చితమైన జాబ్ చార్ట్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఇతర సమస్యలనూ పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పి.గౌరీ శంకర్, ఆర్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీక్ సంఘటనలో తీవ్రంగా నష్టపోయిన వారిలో చాలామందికి ఈనాటికీ ప్రభుత్వపరంగా ఎటువంటి సహాయం అందకపోవడం శోచనీయమని, పరిహారం అందని కుటుంబాలకు తక్షణం పరిహారం అందుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ బాధితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముందుగా ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం సంక్షేమ సంఘం నాయకుడు గొన్నా బత్తుల చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ సంఘటనలో నష్టపోయిన 51 కుటుంబాలకు, కిరాణా దుకాణాలకు సంబంధించి నేటి వరకు ఎటువంటి పరిహారం అందలేదన్నారు. దుర్ఘటన జరిగి ఐదు సంవత్సరాలు పూర్తయిందన్నారు. 51 కుటుంబాలకు, ప్రభావిత కిరాణా దుకాణాలకు తగిన పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న బాధితులు

ఘనంగా వన్ వరల్డ్ సిల్వర్ జూబ్లీ

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: పెదవాల్తేర్‌ లాసన్స్‌బే కాలనీలోని వన్‌వరల్డ్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు గురజాడ కళాక్షేత్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల క్రితం ఈ స్కూల్ స్థాపించామని, ఇప్పటివరకు ఇక్కడ చదువుకుని వెళ్లిన సుమారు 800 మందికి పైగా పిల్లల్లో 500 మందికి పైగా సుస్థిర స్థానాల్లో స్థిరపడ్డారని, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో వివిధ హోదాల్లో ఉన్నారని, చాలా మంది చాలా ఉన్నత స్థానాల్లో ఉన్నారని ప్రస్తుతం వారంతా తనను కలుస్తుండడం ఆనందంగా ఉందని స్కూల్ డైరెక్టర్ కె. సూర్యనారాయణరెడ్డి అన్నారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ శాశ్వత సభ్యులు, స్థానిక ప్రిజమ్ కాలేజీ డైరెక్టర్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ విద్యాసంస్థ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటరామన్‌రెడ్డి, అప్పుస్వా నాయకులు డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, ఎం.వి.రావు, సత్యనారాయణ, డాక్టర్ అనూష ప్రసంగించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. స్కూలు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన స్లైడ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎస్‌టిలుగా గుర్తించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్రలో యాత కులస్తులు 6 లక్షలకు పైగా ఉన్నారని వారిని ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్ అమలు చేయాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జడ్జి కోర్టు జంక్షన్ సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ భారత శిక్షాస్మృతి 1860 ప్రకారం కుల వివక్షకు గురవుతున్న 32 అత్యంత వెనుకబడిన కులాలకు అట్రాసిటీ యాక్ట్ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో గెద్దాడ రమేష్, వడిసల సూరిబాబు, కడవల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలుకు దక్కిన గౌరవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం రవీంద్రభారతిలో నెలకొల్పడం ఆయనకు దక్కిన నిజమైన గౌరవం అని ఎస్పీబి అభిమాన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1985లోనే స్థాపించబడిన దొండపర్తి ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమాన సంఘం సభ్యులు ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరయ్యారు. విశాఖ అభిమాన సంఘం సభ్యులు గణేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ, మా జీవితంలో ఈరోజు మరపురాని జ్ఞాపకం అన్నారు. కార్యక్రమానికి వాసంశెట్టి మురళీకృష్ణ, వెంకీపా, సాయిరాం తదితరులు హాజరయ్యారు.

లేబర్ కోడ్స్‌తో ప్రమాదం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరిలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు తెలిపారు. సోమవారం టౌన్ కొత్త రోడ్‌లోని కార్యాలయంలో ఎఐటియుసి విశాఖ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది.

MISSING PASS PORT

I SIRISHA KONA w/o **VenkateswaraRao** Pattapagala is Residence Door No. 19-7-18 RH Colony Pedagantyada VIsakhapatnam. That My Passport card No.X6005887 dated 8-5-2023 with its expaire 7-05-2033 has been lost by me whiley house shifting from pedagantyada to VUDA colony on date 29-11-2025 at 11.30Am. if any one found **please contact : 9642283477**

ఉల్లాసంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

త్రో బాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ఆనందపురం జట్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డివిజనల్ స్థాయి భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి, సీతమ్మధార మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు జివిఎంసి 3వ వార్డు క్రికెట్ మినీ స్టేడియంలో సోమవారం ఉత్సాహ పూరిత వాతావరణంలో క్రికెట్, త్రో బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు జరిగాయి. ఆనందపురం, పద్మనాభం మండలాల మధ్య, సీతమ్మధార, చినగదిలి మండలాల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. ఆనందపురం, పద్మనాభం మండలాల మధ్య మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, ఎ.జయప్రద, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, స్కూల్ కాంప్లెక్ ఉపాధ్యాయులు డి.ఆదినారాయణ, సత్యారావు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, కైలాష్‌రెడ్డి, సుజాత, పలు కమిటీల సభ్యులు రమణారావు, కె.సన్యాసినాయుడు, అప్పల శ్రీను, రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : చోరీకి పాల్పడిన వ్యక్తిని గాజువాక క్రైమ్ పోలీసుల అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి క్రైమ్ ఎస్ఐ మన్మధరావు కథనం ప్రకారం... దయాల్ నగర్‌కు చెందిన కండిపల్లి సతీష్ (25) గాజువాక మార్కెట్, మరిపాలెం వద్ద ఆగి ఉన్న ఆటోలు నుండి రెండు బ్యాటరీలు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. జగ్గు సెంటర్ వద్ద పట్టుకొని విచారించగా ఆ రెండు ప్రాంతంలోనూ బ్యాటరీలు చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆయన దగ్గరి నుండి రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు. ఈయనపై న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ కూడా నమోదైనట్లు తెలిపారు.

615 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో ధర్మవరం గ్రామ సమీపంలో ఆటోలో తరలిస్తున్న 615 కేజీల రేషన్ బియ్యం ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్ఐ విభూషణ్‌రావు తెలిపారు. పౌర సరఫరా శాఖ అధికారి గణపతి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి 615కేజీలు బియ్యం, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని రాయవరం పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని నక్కపల్లి స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

18న పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్ కళ్యాణ మండపంలో ఈ నెల 18వ తేదీన పెన్షన్‌దారుల సమావేశం నిర్వహిస్తున్నామని చిట్టివలస జ్యూట్ మిల్లు పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ, సహాయ కార్యదర్శి అప్పలరాజు తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగిన పెన్షన్‌దారులు నిరసన కార్యక్రమాల గురించి వివరిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

రోలర్ స్కేటింగ్‌లో శ్రీసాహితికి బంగారు పతకం

ప్రజాశక్తి-మధురవాడ : 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో నగరానికి చెందిన శ్రీ సాహితి బంగారు పతకం సాధించింది. ఈ పతకంతో 106 పతకాలు సాధించినట్లు కోచ్ ఆకుల పవన్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శ్రీసాహితికి జిల్లా ప్రెసిడెంట్ రమేష్ చంద్ర, సెక్రటరీ లక్ష్మణ్ అభినందనలు తెలియజేశారు. వివిఎంఆర్‌డిఎ, శాప్ అందించిన ప్రోత్సాహం తన విజయానికి దోహదపడ్డాయని శ్రీ సాహితి వెల్లడించారు. ఆమె నారాయణ స్కూల్లో పదో తరగతి చదువుతుంది. మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు.

రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన శ్రీసాహితి

సింహాచలంలో 30న వైకుంఠ ఏకాదశి

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీన పవిత్ర పుష్య శుద్ధ ఏకాదశి / వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి)ని వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్య నిర్వాహణాధికారి ఎన్.సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసే వైదిక కార్యక్రమాల వివరాలు, ఉత్తర ద్వార దర్శనం సమయాలు, భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చేపట్టిన సమగ్ర కార్యక్రమాలను వెల్లడించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున వైదిక కార్యక్రమాలు తెల్లవారుజామున 1:00కి సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయని, ఉదయం 5:30 నుండి 11 గంటల వరకు మాత్రమే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ తిరువీధి, మధ్యాహ్నం 12:30 నుంచి 3 గంటల వరకు నివేదనం, పవళింపు కారణంగా దర్శనాలు నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు తిరిగి దర్శనాలు ఉంటాయని వివరించారు. ఈ నెల 29వ తేదీ రాత్రి 7 గంటల తర్వాత కొండపైకి బస్సులు ఉండవని, 30వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి నడుస్తాయని తెలిపారు.

మాట్లాడుతున్న జగదీష్‌బాబు

'రాజకీయ ప్రయోజనాల కోసమే వైసిపి ఆందోళనలు'

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాజకీయ ప్రయోజనాల కోసమే వైసిపి మెడికల్ కళాశాలల పేరుతో రాద్ధాంతం చేస్తోందని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి పాలనలో మెడికల్ కళాశాలలు పెట్టి, పూర్తి చేశామనడం అవాస్తవమన్నారు. అసంపూర్తిగా విడిచిపెట్టిన కళాశాలలను కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో పూర్తి చెయ్యడానికి ముందుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుతం అన్ని కళాశాలలను ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నామని చెప్పారు. అన్ని సౌకర్యాలను విద్యార్థులకు అందజేయడంకోసం ఈ పిపిపి విధానం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, బొడ్డేటి విజయ్ పాల్గొన్నారు.

గీతంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం విశ్వవిద్యాలయంలో రోటరాక్ట్ క్లబ్, జిమ్‌సర్ ఆసుపత్రి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని డాక్టర్ అంజుచౌదరి ప్రారంభించారు. ఈ శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రోటరక్ట్ బ్లడ్ బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి నిపుణులు హాజరై రక్తాన్ని సేకరించారు. రక్తదానం ద్వారా దాతల ఆరోగ్యం సైతం మెరుగు పడుతుందని అంజుచౌదరి పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ఉన్నవారి ప్రాణాలు నిలుస్తాయన్నారు. రక్తదానం చేసిన వారిని హేమంతబగ్గా, చలపతిరావు, కాదంబరి అభినందించారు.

ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జగదీష్‌బాబు

ప్రజాశక్తి -పద్మనాభం : ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్.జగదీష్‌బాబు ఎన్నికైనట్లు సోమవారం తెలిపారు. కడప నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన ఎస్‌టియు 79వ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో విశాఖపట్నం జిల్లాకు చెందిన రెడ్డిపల్లి జగదీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగదీష్‌బాబుకు విశాఖపట్నం జిల్లాలోని ఎస్‌టియు సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- వేపగుంట : చలి ఎక్కువగా పెరగడంతో ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ సంస్థ జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు నిరాశ్రయులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీచేశారు. నాయుడుతోట, కృష్ణానగర్, గోపాలపట్నం, ఎన్ఎడి, 104 ఏరియా, మర్రిపాలెం, కంచరపాలెం, జ్ఞానాపురం, రైల్వే స్టేషన్, దొండపర్తి బ్రిడ్జి కింద, ఆర్‌టిసి బస్టాండ్, బీచ్ రోడ్, పాత పోస్టాఫీస్ ప్రాంతాల్లో రోడ్డు పక్కన, బస్సు షెల్టర్లలో పడుకున్న సుమారు 300 మందికి దుప్పట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో తమకు చేతనైన సహాయం ఇలాంటి వారికి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఐఎస్.రాజు, ఆర్.ఇషిత, ఆర్.విజయ, జి.అప్పలరాజు, కె.దేవిప్రసాద్, ఎం.అప్పారావు, కె.శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం అప్పన్న కాలనీలో భీమిలి ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామాల్లో పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలు శుభ్రత పాటించడం, వ్యాధుల నివారణ పట్ల వారిని చైతన్యపరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.సహదేవుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.శ్రీను, వాలంటీర్లు పాల్గొన్నారు.

టెట్ పరీక్షకు 94.15 శాతం హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో సోమవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 94.15 శాతం అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పూటలా జరిగిన పరీక్షకు 171 మంది అభ్యర్థులకు గాను 161 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

చిరు ధాన్యాలతో మేలు

ప్రజాశక్తి తగరపువలస : చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కుశాల్ మిత్ర సభ్యులు పేర్కొన్నారు. జివిఎంసి 2వ వార్డు పరిధి ఆదర్శనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో వాసవ్య మహిళా మండలి, కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన న్యూట్రిషన్ ఆహారంలో భాగంగా కొర్రల పాయసం చేశారు. కొర్రల్లో మాంసకృతులు, ఐరన్, కాల్షియం అధికంగా ఉంటాయని కుశాల్ మిత్ర సభ్యులు చెప్పారు. దీని వల్ల జీర్ణవ్యవస్థ మెరుగు పడుతుందని, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుందని, సుగర్‌ను నియంత్రిస్తుందని, కీళ్ల నొప్పులు, కాలినగాయాలు త్వరగా మానడానికి, బరువు తగ్గడానికి దోహదపడతాయని తెలిపారు. ఇది బ్యాక్టీరియా వైరస్‌తో పోరాడి కేన్సర్ రాకుండా నిరోధిస్తుందని వివరించారు. మలబద్ధకం, గర్భధారణ సమయంలో బిపి, మధుమేహం రాకుండా నివారించే కారణంగా గర్భిణులు, బాలింతలు తప్పకుండా కొర్రలతో చేసిన ఆహారం తీసుకోవడం మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుసాల్ మిత్ర మెంబర్లు, గర్భిణులు, బాలింతలు, కేర్ టేకర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : శివప్రసాద్ మాస్టారు వర్ధంతి సందర్భంగా అతని శిష్యులు భీమిలిలో నిరుపేదలకు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు మాట్లాడుతూ, శివ ప్రసాద్ మాస్టారు ఆదర్శవంతమైన జీవితం గడిపారని కొనియాడారు. మాస్టారు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనమిచ్చే ఘన నివాళి అన్నారు.

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు తగదు

ప్రజాశక్తి -గాజువాక : బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.శ్రీనివాసరావు, సిహెచ్.నాగరాజు తెలిపారు. షిప్‌యార్డ్, గాజువాక బ్రాంచిల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రస్తుత బీమా రంగంలో ఉపయోగిస్తున్న మొత్తం మూలధనంలో విదేశీ పెట్టుబడుల వాటా సుమారు 32 శాతమేనని, ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్‌డిఐ పరిమితిని 100 శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇవ్వడం అవివేకమైన చర్యగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాకుండా, దేశీయ బీమా సంస్థలకు కూడా తీవ్రమైన దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న బీమా కంపెనీలను విదేశీ సంస్థలు శత్రుత్వపూరితంగా స్వాధీనం చేసుకునే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ మూలధనానికి అధిక స్వేచ్ఛ ఇవ్వడం వల్ల బీమా రంగం క్రమబద్ధంగా అభివృద్ధి చెందడం కాకుండా, ప్రజలకు భద్రత కల్పించాల్సిన రంగం లాభాల కోసమే నడిచే వ్యాపారంగా మారుతుందన్నారు. ఇది ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాల ప్రయోజనాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు. దేశీయ పొదుపులకు విదేశీ మూలధనం ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదన్నారు. దేశ ప్రజల పొదుపులను విదేశీ మూలధనానికి అప్పగించడం ఆర్థికంగానూ, సామాజికంగానూ అర్థం లేని చర్య అని పేర్కొన్నారు.

వేడుక చిత్రానికి ఉత్తమ దర్శకుని అవార్డు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విశాఖపట్నానికి చెందిన ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ బి.రమేష్‌బాబు 'వేడుక' డెమో చిత్రానికి ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. గవర్నర్ పేటలోని మోపిదేవి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, క్రీడ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు. సమాజాన్ని చైతన్య పరిచే పలు భాషా చిత్రాలు ఎంతో అభినందనీయం అన్నారు. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ డైరెక్టర్ దిలీప్ కుమార్, గత ప్రెసిడెంట్ అంబటి మధు మోహన్‌కృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ రమేష్‌బాబు రచన, దర్శకత్వంలో రూపొందిన వేడుక డెమో చిత్రం జ్యూరీ మనసుని తాకిందన్నారు. పేదరికం ఆకలి నేటి యువత పాత్ర కథాంశంగా సమాజాన్ని చైతన్య పరిచే మంచి సినిమా అన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, ఈ అవార్డు ద్వారా మంచి సందేశం సమాజానికి చేరుతుందని హర్షం వ్యక్త పరిచారు. చిత్ర బృందానికి, ప్రొడక్షన్ మేనేజర్ కోన సూర్య ప్రకాష్, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల అధ్యక్షులు జంగం జోషికి, గాయని, నిర్మాత డాక్టర్ రమ్యకి, డిఒపి వినీత్ ఆర్య, నటుడు నిఖిల్ మంగళంపల్లికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు కళాకారులు, నిర్మాతలు వేడుక చిత్ర బృందానికి శాలువాతో అభినందనలు తెలిపారు.

సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91, 92 వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, రిటైనింగ్ వాల్స్, కరెంటు స్తంభాలు, వీధి లైట్లు తదితర సమస్యలపై మేయర్ పీలా శ్రీనివాసరావుకు జనసేన నాయకులు బెహరా భాస్కరరావు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ధవళ మోహన్, ఇల్లపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ ప్రతినిధి

అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ఉమెన్ బాస్కెట్‌బాల్ పోటీలో మూడవ స్థానం, పురుషుల బ్యాడ్మింటన్ పోటీలో రెండవ స్థానంలో నిలిచిన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిఎస్‌కె.చక్రవర్తి ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌ఒడి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు

ప్రజాశక్తి -గాజువాక : విధుల్లో మరింత సౌకర్యార్థం అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో ఉన్న 113 అంగన్‌వాడీ కేంద్రాలకు మొబైల్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, భవన నిర్మాణాలకు నివేదిక తయారుచేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేయనున్నట్లు తెలిపారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి డి.నేలవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాజువాక తెలుగుదేశం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

వార్డుల అభివృద్ధికి కృషి

మేయర్ పీలా శ్రీనివాసరావు

శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నగరంలో అన్ని వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జివిఎంసి 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలో సుమారు రూ.2.89 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సోమవారం దక్షిణ నియోజవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తోందని తెలిపారు. జ్ఞానపురంలో జివిఎంసి నిధులు సుమారు రూ.185.08 లక్షల వ్యయంతో హిందూ శ్మశాన వాటికలో రక్షణ గోడ, సిసి కాలువలు, మరుగుదొడ్ల నిర్మాణానికి, సుమారు రూ. 78.81 లక్షలతో కొండవీధి, గడ్డ వీధి, పోస్ట్ ఆఫీస్ వీధి తదితర ప్రాంతాలలో సిసి రోడ్లు ,కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో సుమారు రూ. 24.85 లక్షల వ్యయంతో నిర్మించిన జివిఎంసి భవనానికి ప్రారంభోత్సవం చేశారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డునూ ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చేసేందుకు నిరంతరమూ కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో జ్ఞానపురం నందు సుమారు రూ.2.89 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో రక్షణ

ప్రజాశక్తి -గోపాలపట్నం : హెల్మెట్ ధరించి ప్రమాదాల బారి నుండి రక్షణ పొందాలని విశాఖ వెస్ట్ ట్రాఫిక్ జోన్ సిఐ పిలుపునిచ్చారు. ఈ మేరకు గోపాలపట్నం, పెందుర్తి ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం నడిపేవారితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే మోటార్ వెహికల్ సెక్షన్ యాక్ట్ ప్రకారం జరిమానాలు ఉంటాయని తెలిపారు. ఈ విషయంపై పోలీసుల సూచనలను, సలహాలను ప్రజలు స్వీకరించాలని కోరారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళ శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం

గోపాలపట్నం బాలికలు, బాలుర పాఠశాల యందు సమగ్ర శిక్ష నిధులు సుమారు రూ. 44 లక్షలతో నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను ప్రభుత్వ విప్ గణబాబు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, వేణుగోపాల్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, నాయకులు మజ్జూరి శ్రీనివాసరావు, ప్రసాదరావు, సూర్యప్రతాప్, దాడి రమేష్ నాయుడు, కంపర ఆనంద్, కొల్లి అప్పారావు, మహమ్మద్ ఖలీల్, అనూష పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన సినీ నటి కీర్తి సురేష్

షాపింగ్‌మాల్ బయట సందడి చేస్తున్న కీర్తిసురేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వేగంగా విస్తరిస్తున్న సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తన 38వ షోరూమ్‌ను సోమవారం ఉదయం విఐపి రోడ్డులో ప్రారంభించింది. ప్రముఖ సినీ నటి కీర్తి సురేష్ హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైవిధ్యభరితమైన ఫ్యాషన్ కలెక్షన్లతో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పండగ వాతావరణాన్ని ముందుగానే ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రాబోయే క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన షోరూమ్ వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించడానికి సిద్ధమైందని తెలిపారు. సంస్థ డైరెక్టర్లు పొట్టి వెంకటేశ్వర్లు, తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ ఈ షోరూమ్ ద్వారా 38వ మైలురాయిని చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. వైజాగ్ వాసుల అభిరుచుల్ని ప్రతిబింబించే అత్యుత్తమ వెరైటీలను అందించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచుల మేరకు నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందజేస్తామని చెప్పారు. ఈ షోరూమ్‌లో సంప్రదాయ వస్త్రాల నుండి సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్ వరకు అన్నీ లభిస్తాయన్నారు. పండగ చీరలు, పట్టు వెరైటీలు, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, ఎత్నిక్ వేర్, ఇండో-వెస్ట్రన్ కేటగిరీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీర్ల రాజమౌళి మాట్లాడుతూ పండగ పర్వదినాలకు అనువైన అన్ని రకాల వస్త్రాలు తమ షోరూమ్‌లో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న కీర్తిసురేష్

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలెక్టరు కార్యాలయంలో సోమవారం మంత్రి అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొని జిల్లా అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. జిల్లా సమీక్షా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి రెవిన్యూ డివిజను నుండి మునగపాక, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలను మినహాయించి అనకాపల్లి డివిజనులోనే కొనసాగించుటకు సమావేశ ఏకగ్రీవ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. పంచదార్ల పుణ్యక్షేత్ర కొండలను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై కలదని, అక్కడ ఎటువంటి మైనింగుకు అనుమతులు మంజూరు చేయకూడదని సమావేశం తీర్మానించారు. రీసర్వే, రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో సేకరించి ల్యాండ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరుగుతున్నారు. పాడుబడిన పాఠశాల భవనాల స్థానంలో కొత్తవి నిర్మాణం చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లు ఇతర నిర్మాణ పనులన్నింటిని వేసవి కాలంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సీనరేజీ వసూలు చేస్తున్న ఎఎంఆర్ కంపెనీపై చర్యలు తీసుకోవాలన్నారు. శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు వివిధ అంశాలపై మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలోనికి క్వారీ లారీలు ప్రవేశించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి తహశీల్దారు కార్యాలయాన్ని పట్టణ, గ్రామీణ కార్యాలయాలుగా విడదీయాలన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ బల్కడ్రగ్ పరిశ్రమ గూర్చి వారితో చర్చలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో జెసి ఎం.జాహ్నవి, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, గాదె శ్రీనివాసులు నాయుడు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, కెఎస్ఎన్ఎస్.రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మళ్ల సురేంద్ర, గండి బాబ్జి, పీలా గోవిందసత్యనారాయణ, కోన తాతారావు, కోట్ని బాలాజీ, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో అయ్యన్న తదితరులు

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : బీమా రంగంలో 100 శాతం ఎఫ్డిఐ పెంపు కేంద్ర ప్రభుత్వ అవివేక చర్య అని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి బ్రాంచ్ కార్యదర్శి ఆడారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈనెల 12న పలు కార్పొరేట్ అనుకూల ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలిపిందని, అందులో భాగంగా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచడం. అలాగే బీమా చట్టాల సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎఫ్డిఐ పరిమితిని 100 శాతానికి పెంచడం, విదేశీ మూలధనానికి పూర్తిస్థాయి స్వేచ్ఛ ఇవ్వడం పూర్తిగా అవివేకమైన చర్య అని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, దీనికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించేందుకు పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

విద్యుత్ పొదుపుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా అనకాపల్లి పట్టణంలో ఏ.పి.ఈ.పి.డి.సి.యల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. సూర్యనారాయణ మూర్తి ఆలయ సమీపం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ యన్.టి.ఆర్ స్టేడియం వరకు కొనసాగింది. సుమారు 200 మంది విద్యుత్ శాఖ ఉద్యోగులు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించే కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహక ఇంజినీర్లు కె. రాజశేఖర్, సంబంగి రామకృష్ణ, యు.జె.కె. గౌరీ ప్రసాద్, యుపి చెల్లుబాబు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.అప్పారావు పాల్గొన్నారు.

ఎంవిఆర్‌ను కలిసిన పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు సేవ చేసేందుకు ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు కోరారు. ఈ మేరకు నరసింగరావుపేటలోని ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో గైపూరి రాజు ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రత్యక్ష రాజకీయాలోకి త్వరగా వచ్చి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ ప్రకాష్, ఎం రాజబాబు, ఎస్ దానియేలు, టి సత్యానందం, కె జానుబాబు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 21న జిల్లావ్యాప్తంగా పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో కలిసి పోలియో బ్యానర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయడం ద్వారా మాత్రమే పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు, డిఎంహెచ్ఒ డాక్టర్ హైమావతి, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ.అగ్రహారం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం విద్యుత్ శాఖ సిబ్బంది ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యను జడ్పీటీసీ దొండ రాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడినట్లు సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, గ్రామ వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

కురం రమణ జ్ఞాపకార్థం బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో పైడితల్లమ్మ గుడి వద్ద సోమవారం త్రాగునీటి బోరు ఏర్పాటు పనులను స్థానిక సర్పంచ్ మరిసా నాని ప్రారంభించారు. వైసీపీ నాయకులు కురం రమణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఈ బోరు నిర్మాణం చేస్తున్నారు. కార్యక్రమంలో కురం అప్పలనర్స, జెడ్పిపోతల తాతరాజు, వార్డ్ మెంబర్ ఏలుసూరి వర్మ, కురం రాజేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆదినారాయణ మహిళా కళాశాలలో ఈనెల 17న జరుగు మెగా జాబ్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జాబ్ ఫెయిర్‌కు సంబంధించి పోస్టర్ ను అధికారులతో కలిసి రిలీజ్ చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై నమోదు చేసుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లను అంగన్వాడీ టీచర్లకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఐసిడిఎస్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు ఈ సెల్ ఫోన్లను సమర్థంగా వినియోగించి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఐసిడిఎస్ పిడి ఎన్ సూర్యలక్ష్మి, సిడిపిఒలు, సంబంధిత శాఖ అధికారులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్రికెట్ విజేత బుచ్చయ్యపేట

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన డివిజనల్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు మూడవరోజు క్రికెట్ ఫైనల్ పోటీ సోమవారం జరిగింది. అత్యంత ఆసక్తికరంగా సాగిన ఈ పోటీల్లో బుచ్చయ్యపేట మండలం జట్టు విజేతగా నిలవగా, అనకాపల్లి మండలం రన్నరప్‌గా నిలిచాయి. యం శ్రీనివాస్, సాయిబాబా మాస్టర్, ఎస్టిఎఫ్ సెక్రటరీ నాయుడు, ఎంఇఒ అరుణ్ కుమార్‌లు విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. మొత్తంగా మూడు రోజులు పాటు ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ పోటీల్లో మహిళ ఉపాధ్యాయులు త్రోబాల్, పురుష ఉపాధ్యాయులు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ క్రీడల్లో విజేతలుగా నిలిచిన మహిళ ఉపాధ్యాయులు త్రోబాల్ విజేత రాంబిల్లి మండలం, ఉపాధ్యాయులు క్రికెట్ పోటీల్లో విజేత బుచ్చయ్య పేట మండలం జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయబడతాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రజ్ఞా 2కె 25 వార్షిక పరిశోధనా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆటానమస్ కళాశాలలో నిర్వహించిన ప్రజ్ఞా-2కె25 వార్షిక పరిశోధన సదస్సు సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, రొబొటిక్స్, నూతన టెక్నాలజీస్ పై పరిశోధన చేస్తున్న విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్య అతిథిగా విఘ్నాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, ఐ.ఐ.సీ హెడ్ డా. డి. విజయలక్ష్మి హాజరై, పరిశోధన విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లను పరిశీలించి మార్గదర్శక సూచనలు అందించారు.

పిజిఆర్ఎస్ అర్జీలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పిజిఆర్ఎస్ అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పెండింగు లేకుండా అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పి కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్లు మొత్తం 50 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, రమేష్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల్లో వారసులను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోన్‌లో ఖాళీ అయిన రిటైర్మెంట్, డెత్, సిక్కు పోస్టుల్లో వారి వారసులను నియమించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. దీనిపై జెడిసి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, మున్సిపల్ పారిశుధ్య ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జీవీఎంసీ అనకాపల్లి జోన్ ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన పారిశుధ్యం కార్మికులుగా సుమారు 250 మందిని ఇంకా కొత్తగా నియమించాల్సివుందన్నారు. గతంలో మున్సిపల్ కార్మికులు జివిఎంసి ఏర్పడిన నాటి నుంచి గల రిటైర్మెంట్, డెత్, సిక్కు కార్మికుల వారసులకు అన్యాయం జరుగుతుందని, వారందరికీ న్యాయం చేయాలని కోరారు. కనీసం మున్సిపల్, జివిఎంసి ఏర్పడిన అప్పటి నుండి ఇప్పటివరకు గల రిటైర్మెంట్, మతి చెందిన, సిక్కు కార్మికుల వారసులు కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, పర్మినెంట్ కార్మికులు సుమారు వందమంది కార్మికుల పిల్లలు మాత్రమే ఉన్నారని, వారిలో అర్హులైన వారందరికీ జీవీఎంసీ లో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులుగా నియమించి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కాళ్ల తేలయ్య బాబు, వై. ఓం నమ:శ్శివ, గోవిందరావు, అజయ్, సంతోష్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది పిఎసిఎస్ చైర్మన్‌గా దొండ నరేష్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) చైర్మన్‌గా టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా వడ్డాది టౌన్ జనసేన అధ్యక్షుడు దొండా సాయి, చిన్న అప్పన్నపాలెం టిడిపి నేత చల్లా లోవరాజు నియమితులయ్యారు. మండలంలోని 6 పిఏసిఎస్‌లు ఉండగా, 5 సొసైటీలకు గతంలోనే త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ ఐదు టిడిపి నేతలకు కాగా, వడ్డాది సొసైటీని జనసేనకు కేటాయించారు. అయితే ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు వర్గీయుల మధ్య విభేదాలు కారణంగా ఏకాభిప్రాయం రాకపోవడంతో వడ్డాది సొసైటీ కమిటీ ఎంపిక నిలిచిపోయింది. చివరకు ఇది కూడా టిడిపికే దక్కింది. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మేనల్లుడు, టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్‌కు చైర్‌పర్సన్ పదవి దక్కింది.



దొండ నరేష్

కరాటేలో డావెన్సీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు "ఫస్ట్ ఓపెన్ ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ ఒకే నావాన్ షోరుణ్య సుభాగా కరాటే ఛాంపియన్ షిప్ 2025"లో ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీలలో పదిమంది విభిన్న విభాగాలలో పాల్గొని 21 మెడల్స్ సాధించి ఆల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ మూడో స్థానాన్ని పంచుకున్నారు. అండర్-8 విభాగంలో సాత్విక్, ఆరిస్, అరుష్‌లు 2 గోల్డ్, 2 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. అండర్-11 విభాగంలో వై.అన్విజా, తన్విత, మనస్వి మహతి, భవాని, సాయి వివాన్, దీక్షితలు 2 గోల్డ్, 6 సిల్వర్, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని, కోచ్ తులసిరావును విద్యా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జె.రమణాజీ, పాఠశాల ప్రధానాచార్యులు మీనా మిశ్రా అభినందించారు.

జిల్లా స్థాయి వికలాంగుల ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 3 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్లో వికలాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను ప్రముఖ వైద్యులు గండి వెంకట సత్యనారాయణరావు జెండా ఊపి ప్రారంభించారు. అంగవైకల్యం, అంధులు, బధిరులు, వికలాంగ పిల్లలుగా వర్గీకరించి ట్రై సైకిల్ రేస్, బ్యాటరీ ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, జావ్లీన్ త్రో, డిస్క్ త్రో, షాట్ పుట్, క్యారమ్స్, చెస్, మ్యూజికల్ చైర్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు కొరుపురోలు వెంకటేశ్వరరావు, ఎస్ అర్జున్ రావు, కనిశెట్టి సురేష్ బాబు రాజాన దొరబాబు, గాడి బాలు, ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిన్ స్విమ్మింగ్ పోటీలకు సంస్కృతి విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : ఈ నెల 19 నుండి 22 వరకు మంగుళూరులో జరుగు ఐదో జాతీయ స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీలకు మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. గత నెల 16వ తేదీన విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ జరిగిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీలలో పతకాలు సాధించిన జె.జయదీప్, డి.నిఖిల్, ఎల్.హిమప్రభాస్, యువరాజ్, ఆర్.శరత్, పి.తేజస్వరూప్, కార్తికేయ యస్వంత్, ఇక్రమ్, సాహిల్ గోవింద్ ఈ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరిని పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

పంచాయతీ భవనం నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంంలోని చంద్రయ్యపేట గ్రామంలో ఉపాధి హామీ విధులు రూ.7లక్షలు, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ నిధులు రూ.25లక్షలు వెరసి రూ.32లక్షలతో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణ పనులకు మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి సుమతి, టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, నాయకులు సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, సబ్బవరపు అప్పలనాయుడు, సబ్బవరపు వాసుదేవన్, యాళ్ల సింహాచలంనాయుడు, యాళ్ల నాయుడు, పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని పెట్టు గొల్లపల్లి, రామయ్యపట్నం, ధర్మవరం, ఎస్.రాయవరం, గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ సోమవారం పరిశీలన చేశారు. ప్రతీ పంచాయతీలో తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద తయారీ కేంద్రం వద్దకు తరలించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని ఆదేశించారు.

దళారుల చేతిలో మోసపోవద్దు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని పిఎసిఎస్ అధ్యక్షులు దొగ దేముడునాయుడు అన్నారు. మండలంలోని కలిగొట్ల గ్రామంలో పిఎసిఎస్ వద్ద సోమవారం రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రైవేటు వర్తకులకు ధాన్యం అమ్మవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు ప్రభుత్వానికే విక్రయించాలని కోరారు. ధాన్యం ఇచ్చిన 24 గంటల్లో రైతు అకౌంట్లో డబ్బులు జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ కారుకు ప్రమాదం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జిల్లా కలెక్టర్ కారు రాంగ్ రూటులో వెళ్లి వేరొక కారును ఢీకొట్టింది. శంకరం శివారులో ఏలేరు కాలువ వద్ద రెండు కారులు ఢీకొనగా బాగా దెబ్బ తిన్నాయి. ఆ సమయంలో కారులో కలెక్టర్ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

వీధి విక్రయదారులపై అధికారుల దౌర్జన్యం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లి : వీధి విక్రయదారులపై జీవీఎంసీ అధికారులు దౌర్జన్యం సరికాదని జీవీఎంసీ జోనల్ కమిషనర్ ముందు సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొర బాబు మాట్లాడుతూ వీధి విక్రయదారులు రోడ్లపై తోపుడు బండ్లు, బడ్డీలు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారిపై జీవీఎంసీ అధికారులు దౌర్జన్యం చేసి బడ్డీలను చితక్కొట్టి జీవీఎంసీ వాహనాలపై తీసుకెళ్లడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వియ్యపు రాజు, తాకసి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలను గుర్తించని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతుల కష్టాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గుర్తించడం లేదని ఆప్ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు ఆరోపించారు. అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతూ నెహ్రూ చౌక్ సెంటర్లో ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఎల్లపు రామశేషు, ఎస్ ప్రకాష్, అజిరుషెన్ పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కొత్తపట్నం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు సోమవారం అచ్యుతాపురంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు నూకన్న దొర, కోదండరావ్, నూకరాజు తాతారావు, అంజి, పైడిశెట్టి, మసాని గణేష్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక గుండాల జంక్షన్ ఎస్ఆర్ శంకరన్ హాల్లో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వ అధికారులతో కలసి చేపట్టారు. అనకాపల్లి మండలంలోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి విన్నవించగా ఎమ్మెల్యే సామరస్యంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ప్రజల సుమారు 240 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహశీల్దారు, ఎంపీడీవో ఆశాజ్యోతి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రజాదబ్బారు నిర్వహిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం బత్తివానిపాలెం బల్క్ మిల్క్ కేంద్రం దగ్గర ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిరసించారు. మండలంలోని ప్రజలు సుమారు 60 అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, టిడిపి మండల రొంగలి మహేష్, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, చౌడువాడ, కె.కోటపాడు పిఎసిఎస్‌ల చైర్మన్లు రాజి నారాయణమూర్తి. చీపురుపల్లి రామారావు. టిడిపి నాయకులు కన్నూరు సూర్యనారాయణ, వంటకు శ్రీను, బోజంకి సూర్యనారాయణ, జనసేన నాయకులు కుంచ అంజిబాబు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి : మంత్రి రవీంద్ర

అనకాపల్లి : ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం నిర్వహిస్తుందని జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య నేతలతో ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అమరజీవి పుట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, నాయకులు దాడి రత్నాకర్, మల్ల సురేంద్ర, కోట్ని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు అభిమాని పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యాన జగన్నాధ థియేటర్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

అనకాపల్లి : కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ విజయ కృష్ణన్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సిహెచ్.తిలక్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్‌పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం రత్నం ప్రకాష్, డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పొట్టి శ్రీరాములు జీవితం, ఆయన చేసిన ప్రాణ త్యాగం భావితరాలకు స్పూర్తిదాయకమని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అమరజీవి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఇన్ఛార్జి డిఆర్ఒ, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ శేషశైలజ పాల్గొన్నారు. ఫిషింగ్ హార్బర్ వద్దగల బాలవికాస ఫౌండేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ బాబ్జి, లక్ష్మి పాల్గొన్నారు. బాలలకు విద్యాసామగ్రి అందజేశారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి మాట్లాడారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అమరజీవి వర్ధంతి కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాకను అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని కోరుతూ సోమవారం మండల టిడిపి నాయకులు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మునగపాక మండలాన్ని 50 కిలోమీటర్ల దూరంలో నూతనంగా ఏర్పాటు చేసిన నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయడం వలన రైతులు, వృద్ధులు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలు భౌగోళికంగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌కు దగ్గరగా ఉండటం వలన ప్రజలందరికీ సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, పిఏసిఎస్ అధ్యక్షులు విల్లూరి నూక నరసింహారావు, ఆడారి కన్నబాబు, కే శంకర్, పి రాజు నాయుడు, ఎం యుగంధర్, ఏ వెంకటరమణ పాల్గొన్నారు.

మండల పరిషత్ ఎఒగా త్రినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(ఏవో)గా ఎస్.త్రినాథ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏవోగా పనిచేసిన కె. శివప్రసాద నారాయణరావు బుచ్చయ్యపేట మండలానికి ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి త్రినాథ్‌రెడ్డి ఇక్కడ ఏవోగా బాధ్యతలు స్వీకరించారు.

మార్కెట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర గనుల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్‌లు సోమవారం కలిసి తమ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న సమస్యలపై కమిటీ గౌరవ అధ్యక్షులు పెతకంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విన్నవించారు. స్పందించిన మంత్రి వీటిపై విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టిడిపి జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్, యూనియన్ నాయకులు జగదీష్, పొలిమేర పవన్ కుమార్, పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని సత్యవరం ఏడిజెఆర్ జెడ్పీ హైస్కూలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అంగన్వాడి సూపర్ వైజర్ షేక్ రంజాన్ బీబీ బాల్య వివాహాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి ప్రీతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎమ్.మహేశ్వరువు, ఎ.జాన్, డాక్టర్ కే. బాబురావు, ఎమ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 55 మంది కంటి రోగులకు శంకర్ ఫౌండేషన్ అప్తమాలజిస్ట్ రత్నం రాజు పరీక్షలు చేశారు. వారిలో 25 మందికి కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు పూజ్య మేఘన, ప్రభుత్వ కంటి వైద్యులు భవాని, క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్.అశ్వని కుమార్, వైద్య సిబ్బంది తులసి తదితరులు పాల్గొన్నారు.

నరసింహమూర్తికి కుమార్ పరామర్శ

ప్రజాశక్తి-వడ్డాది : అనారోగ్యంతో బాధపడుతున్న జనసేన సీనియర్ నేత అడపా నర్సింహమూర్తిని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, ఆయన సతీమణి మాజీ జెడ్పిటిసి సత్యవతి సోమవారం వడ్డాదిలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ కాలంగా నరసింహమూర్తి తమకు మంచి మిత్రుడని, రాజకీయంగా తమను ఎంతో ప్రోత్సహించారని కుమార్ తెలిపారు.

ప్రైవేటీకరణతో కార్పొరేట్లకు మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్పొరేట్ వర్గాలకు మేలు చేసేందుకే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటుందని ప్రజాసంఘాల ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిన్ని యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేసారు.

కెఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీకాకతాంబ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎస్ఆర్ స్పోర్ట్స్‌ను అకాడమీ పైసా మాస్టర్ ఆధ్వర్యంలో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. పైసా మాస్టర్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

అభయాంజనేయ స్వామి తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో మంగళవారం జరుగు అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవ పోస్టర్‌ను సోమవారం గ్రామంలో తురకలపూడి పిఎసిఎస్ చైర్మన్ కోట సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర్థ మహోత్సవం సందర్భంగా వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ కోట సత్యనారాయణ

ఆంగ్ల భాషా పరిజ్ఞానంపై పోటీలు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నక్కపల్లి : విద్యా సంస్కరణలులో భాగంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్లభాషా నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర విద్యా పరిశోధక సంస్థ ఆదేశాల మేరకు ఆంగ్లభాషా పఠన,లేఖన నైపుణ్యం పోటీలను నక్కపల్లిలో బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం .శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా చినదొడ్డిగల్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విబాలాజీ వ్యవహరించారు. పోటీలకు పర్యవేక్షకులుగా ఎంఇఒలు కె.నరేష్, రుత్తల నాగన్నదొర వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-1 కె.నరేష్ మాట్లాడుతూ మండలంలో 12 ఉన్నతపాఠశాలల నుండి 6వ తరగతి నుండి 10 వ తరగతివరకు చదువుతున్న 60 మంది విద్యార్థులు ఈ పోటోల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన .ఐదుగురు విద్యార్థులను విజేతలుగా ప్రకటించి జిల్లాస్థాయికి ఎంపిక చేశామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థుల్లో ఆరిపాక కార్తికేయ(వేంపాడు) కె.మోక్షిత్ (రమణయ్యపేట), ఎం,యామినీదేవి (వేంపాడు), ఆర్.అపరంజి (గొడిచర్ల, కె.నందినీలక్ష్మి (చినదొడ్డిగల్లు) ఉన్నారు. .న్యాయనిర్ణేతలుగా వై.వి రమణ, నాగేశ్వరరావు, శివప్రసాద్, నీలకంఠకుమార్, జాస్మిన్, ప్రియదర్శిని, భవ్య వ్యవహరించారు.

అబాకస్ పోటీల్లో తనుష్ ప్రతిభ

తనుష్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధి

ప్రజాశక్తి- రావికమతం: విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన గుట్టా తనుష్ ప్రథమ స్థానంలో నిలిచారు. అనకాపల్లి జిల్లా స్థాయిలో 43 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒక ప్రైవేటు పాఠశాలలో 5 తరగతి చదువుతున్న తనుష్ జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలవడంతో పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు తనుష్‌కు అభినందనలు తెలిపారు.

పాతమల్లంపేటలో గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాత మల్లంపేటలో సోమవారం నిర్వహించిన గ్రామసభ ప్రశాంతంగా జరిగిందనిగ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి అన్నారు. గ్రామసభకు పాత మల్లంపేట గ్రామంలోని 14 వార్డుల నుంచి ప్రజలు హాజరయ్యారని టిడిపి సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, గెడ్డం ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో మండల జనసేన నాయకులు గండం దొరబాబు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు నీలాపు చంద్రరావు, మధ్య సోములు, గడ్డం బాబ్జీ, నాగేశ్వరరావు, పాల్గొన్నారు. గొలుగొండ పంచాయతీ శివారు పేటమాలపల్లి, 80 కాలనీల దళితులు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

స్క్రబ్ టైపస్‌పై అప్రమత్తత

ప్రజాశక్తి- రావికమతం: స్క్రబ్ టైపస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట పిహెచ్‌సి డాక్టర్ సురేఖ సూచించారు. సోమవారం కొత్తపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్క్రబ్ టైపస్, న్యూమోనియా, మలేరియా, డెంగీ ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు హెచ్ఎం కృష్ణ కుమారి, టీచర్స్ అనురాధ, రత్నబాబు, శ్రీనివాసరావు, శ్రీను, దాసు, నాగరాజు, జ్యోతి.వెంకట లక్ష్మి, పద్మ, ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాల అమలుకు ఆందోళన

ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాల అమలుతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిచాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ, గత సమ్మె కాలం ఒప్పందంలో భాగంగా 12వ పిఆర్‌సి కమిటీని వేసి వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణచేసిన, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని. కోవిడ్ సమయంలో నియమితులైన కార్మికులు, బదిలీ కార్మికులకు భవిష్యత్తులో భర్తీ చేయు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని, జనాభాకు తగ్గట్టుగాకార్మికులను నియమించి పని భారం తగ్గించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి నివేదిస్తామని అధికారులు హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, శివ, యూనియన్ నాయకులు ఎం. బాబురావు, సంపత్, దుర్గ రవి, తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలి

సమావేశమైన మీటర్ రీడర్స్

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. సోమవారం నర్సీపట్నం ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు వేల మంది మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వీరంతా కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో భవిష్యత్తులో ఉద్యోగ భద్రత లేకుండా పోతుందనిమీటర్ రీడర్స్ ఆందోళన వ్యకం చేస్తున్న వారి ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సూరిశెట్టి అప్పుల కొండ, డివిజన్ ప్రెసిడెంట్ కరణం సంతోష్, చింతకాయల వెంకట రమణ, ,వంటాకుల శ్రీరామ్మూర్తి, బోడ్డేటి వెంకట సూరి అప్పారావు, వెంకట రమణ, ఇంజవరపు దారరాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి సాయం అందజేత

లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో అమలాపురం గ్రామానికి చెందిన గరికిన తాతారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం కూటమి నాయకులు అందజేసారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడిన గరికిన తాతారావు దుస్థితిని కూటమి నాయకులు హోంశాఖ మంత్రి పంగలపూడి అనిత దష్టికి తీసుకు వెళ్లడంతో ఆమె వెంటనే స్పందించి, సీఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.1.07లక్షల సాయాన్ని మంజూరు చేయగా, సోమవారం లబ్ధిదారునికి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇంచార్జ్ ఏరిపిల్లి అప్పలరాజు,గ్రామశాఖ అధ్యక్షులు సూరకాసుల గోవిందరావు, జనసేన పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గంటా నరసింగరావు, పాయకరావుపేట నియోజకవర్గం ఐటిడిపి ప్రధాన కార్యదర్శి ఏరిపిల్లి సత్తిబాబు, రాకతి రాజు, సూరకాసుల బాబ్జి, ఏరిపిల్లి శివాజీ, గరికిన రమణ, సూరకాసుల నూకరాజు పాల్గొన్నారు.

కోతుల బారి నుంచి రక్షణ కల్పించాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి - రావికమతం: కోతుల భయం నుండి స్థానికబిసి హాస్టల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత గోవిందరావు మాట్లాడుతూ, కోతుల భయంతో బిసి హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లి పోయిన విద్యార్థులను ఒప్పించి, భరోసానిచ్చి సోమవారం హాస్టల్‌కు, పాఠశాలకు రప్పించి అప్పగించామన్నారు. అయితే గిరిజన బాలికలకు కోతుల బారి నుండి రక్షణ కల్పించాలని కోరారు. , హాస్టల్‌లో ఉన్న నేరేడు, మర్రి, మొదలగు భారీ వక్షాలను తొలగిస్తే కోతులు హాస్టల్లోకి చొరబడే అవకాశం ఉండదన్నారు.

ల 8న హాస్టల్ విద్యార్థులు పాలిక స్నేహ, సీదరి మంగ కోతుల దాడికి గురైన నేపథ్యంలో మిగిలిన విద్యార్థులు భయాందోళనలకు గురై హాస్టల్‌లో ఉండడానికి ఇష్టం లేక ఇళ్లకు వెళ్లిపోయారని, వారి చదువులు పాడౌతుండడంతో ఒప్పించి తిరిగి హాస్టల్‌కు రప్పించామన్నారు. ఈలోగా నర్సీపట్నం ఎఎస్‌డబ్ల్యూఒ స్పందించి, దగ్గరుండి హాస్టల్‌లో జంగిల్ క్లియరెన్స్, పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టారన్నారు. అయినప్పటికీ విద్యార్థుల్లో భయం తొలగిపోని నేపథ్యంలో వారికి ఎటువంటి ప్రాణహాని, భయం లేకుండా సంబంధిత అధికారులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు పాంగి భాస్కరరావు, మర్రి రాము, కిల్లో సూరిబాబు, పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 16 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. 16, 17న ఏఎల్.పురం-1, 18న చోద్యం, 19న కొత్తమల్లంపేట, 20న గొలుగొండ, 22న జోగంపేట, 23న పాకలపాడు, 24న చీడిగుమ్మల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ శిబిరాల్లో కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్ డేట్, మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-రోలుగుంట : స్థానిక పిఎసిఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోలుగుంట పిఎసిఎస్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని రైతులు కోత కోసిన 48 గంటల నుచి ఏడు రోజుల్లోపు ఎప్పుడైనా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావచ్చునానరు. రైతులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాబునాయుడు, మండల టిడిపి అధ్యక్షులు చంద్ర, రోలుగుంట ఎంపిటిసి రామకృష్ణ, టిడిపి మాజీ అధ్యక్షులు చంద్రమౌళి, సెక్రటరీ మహేష్, పిఎసిఎస్ సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో కెబిపి అగ్రహారం, ఒమ్మవరం గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారు. ఒక్కో భవనాన్ని రూ.32లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, నాణ్యతతో భవన నిర్మాణ పనులు చేపట్టి, మార్చినెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోమటి శంకర్రావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజన కొండనాయుడు,కోట గోవిందు, పంచాయతీరాజ్ డిఇఇ సత్యనారాయణ, మరుపాక మోడల్ స్కూల్ ఛైర్మన్ కాసేటి రాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఎఎల్.పురం గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో 15 వీధి కుక్కలకు, 5 పెంపుడు కుక్కలకు సోమవారం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా కుక్కకాటుకు గురైన బాధితులు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ శిరీష అవగాహన కల్పించారు కుక్క కరిచిన వెంటనే చల్లటి నీరు, లైఫ్ బాయ్ సబ్బుతో గాయాన్ని వెంటనే బాగాకడగాలని, ఆలస్యం చేయకుండా మొదటి మూడు గంటల్లోనే వైద్యులను సంప్రదిస్తే పిచ్చికుక్క వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తారన్నారు. రేబిస్ వ్యాధికి గురైతే చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గం కనుక కుక్కకాటు బాధితులు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు, చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో కేడిపేట పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ఐఐటీ ఖరగ్‌పూర్‌కు చెందిన నిపుణుల బృందం అవగాహన కల్పించారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డాక్టర్ తారకనాథ్ మజుందర్, డాక్టర్ గారదాస్ మహాపాత్ర బృందం గ్రామంలోని మౌలిక సదుపాయాల స్థితిగతులపై ఆరా తీసి, గ్రామ సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఉలబాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

★ సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం

ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖలో జరుగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వాడవాడలా సిఐటియు జెండాను ఎగరవేశారు. సంఘ కార్యాలయాల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో అరుణ పతాకం రెపరెపలాడింది. తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఈ మహాసభ విశేషాలను వక్తలు వెల్లడించారు. జనవరి 4న జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఉక్కునగరంలోని కార్యక్రమంలో జగ్గునాయుడు తదితరులు

అనకాపల్లిలో సిఐటియు పతాక ఆవిష్కరణ చేస్తున్న నేతలు, కార్మికులు

రైల్వే వేగన్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కె.లోకనాథం

విశాఖకలెక్టరేట్ :జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనం వద్ద సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు వై.రాజు ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గంపై నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని సమాయత్తం చేస్తూ ఐక్య పోరాటాలకు సిఐటియు పిలుపునిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమార్ మంగళం, బి.జగన్, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : 22వ వార్డు పిఠాపురం కాలనీలో ఉన్న సీతారాం ఏచూరి భవనం ఎదుట ఎయు విశ్రాంతి ఉద్యోగి పీతల అప్పారావు జెండాను ఆవిష్కరించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. వి.కృష్ణారావు, జివిఎన్.చలపతి, కె.కుమార్ పాల్గొన్నారు.

గాజువాక : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని కార్మిక నాయకులు వై.సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆర్‌కె. నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాధవధార : సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కంచరపాలెం జోన్‌లోని 49, 50, 51, 52 వార్డుల మున్సిపల్ ఆఫీస్ వద్ద కార్మికులు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, కూన.వెంకటరావు, కూన సత్యనారాయణ, బాలరాజు, సత్య తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం, పాత బస్టాండ్, చిన్న బజారు జంక్షన్ వద్ద యూనియన్ జెండాలను విష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పి.సూర్యనారాయణ, ఆటో, ముఠా కార్మికులు పాల్గొన్నారు

గాజువాక : రామచంద్రనగర్, రిక్షా కాలనీ, బానోజీ తోట, టోల్ గేట్ల వద్ద సిఐటియు జెండాలను ఎగురవేశారు. సిఐటియు నాయకులు ఎం.రాంబాబు పాల్గొన్నారు. వడ్లపూడిలోని రైల్వే వేగర్ వర్క్‌షాపు వద్ద సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే భోగిలు తయారు చేసే కార్మికులను పర్మినెంట్ కార్మికులగా చూడాలి తప్ప, కాంట్రాక్టు కార్మికులుగా చూడరాదన్నారు. రైల్వేలో నూటికి నూరు శాతం కాంట్రాక్టు కార్మికులు పనిచేయడం ఎక్కడా లేదన్నారు.కార్యక్రమంలో ఎం.రాంబాబు, ఎల్.బంగారు నాయుడు, వి.అప్పలరాజు, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

షీలానగర్ ఆటో స్టాండ్ వద్ద ఆటో రిక్షా కార్మికులు పోస్టర్లను విడుదలచేశారు. ఆ పోస్టర్లను ఆటోలకు, కూడలి వద్ద అంటించారు.కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నాగరాజు రమణమూర్తి, శంకర్, దేవుడు, బాలినాయుడు పాల్గొన్నారు.

భెల్ ఎటిఎం గేట్ వద్ద సిఐటియు జెండాను కంపెనీ సీనియర్ కార్మికుడు సిహెచ్.నారాయణ ఆవిష్కరించారు. జిటిపి.ప్రకాష్, ఎన్.రాజేంద్ర ప్రసాద్, కె.నారపరెడ్డి, ఎస్.జగన్నాధరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : బివికె.కాలేజీ వద్ద ఆటో కార్మికులు జెండాను ఎగురవేశారు. ఎఎస్ఆర్ నగర్, ఆర్‌కె.నగర్ 1, 2 రైల్వే న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో జెండాలు ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో ఉలవల బాబ్జీరావు, ప్రకాష్, గౌరీష్, శంకర్ పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో భీమిలి, తగరపువలసలో పలుచోట్ల జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎన్. మూర్తి, నేలతి రాము, పంపాను శివనారాయణ, గుజ్జు నరసింహారావు పాల్గొన్నారు

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మొత్తం 38 చోట్ల జెండాలను ఎగరవేశారు. షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, కోరమండల్, గంగిరెడ్డి, శరత్ చటర్జీ, ఐపిఎల్ గొడౌన్స్, భవన నిర్మాణ, ముఠా కార్మిక, తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు, మినీ మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన మల్కాపురం, సింధియా, ఎకెసి, ఎఎస్‌షి, చింతలోవ, క్రాంతినగర్, త్రినాధపురం, దుర్గానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, జిఎ.కాలనీ, నెహ్రూనగర్, ములగాడ హౌసింగ్ కాలనీ, శ్రీహరిపురం, కోరమండల్ గేట్లు వద్ద జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, పి.పైడిరాజు, ప్రసాద్, బిఎస్‌ఎన్.రాజు పాల్గొన్నారు.

విశాఖ సిఐటియు కార్యాలయం వద్ద పతాకావిష్కరణ

ప్రజాశక్తి కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ దృశ్యం

మధురవాడ : పిఎం.పాలెం, మధురవాడ, స్వతంత్ర నగర్ వార్డు కార్యాలయాల వద్ద మున్సిపల్ కార్మికులు జెండాలను ఎగురవేశారు. బి.కొండమ్మ, ఎ.కమలమ్మ, డి.అప్పలరాజు, బి.నర్సింగరావు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.రామారావు తదితరులు మాట్లాడారు.

అనకాపల్లి : సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా కార్యాలయం, జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించిన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి విశాఖపట్నంలో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలకు అన్ని రాష్ట్రాల నుండి 2000 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సంఘం సీనియర్ నాయకులు వై..యేసురాజు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, పిఎన్‌వి.పరమేశ్వరరావు, సిహెచ్.రూపాదేవి, నాయకులు కె.తేలయ్యబాబు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడలో మండల పరిషత్ కార్యాలయ జంక్షన్, సినిమా హాల్ జంక్షన్, పరవాడ ఫార్మసిటీలో విజయ్‌శ్రీ, బైకాన్, లంకెలపాలెం జంక్షన్, సింహాద్రి జంక్షన్ తదితర ప్రాంతాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. మండలం పరిషత్ జంక్షన్ వద్ద సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. బైకాన్ వద్ద ఫార్మాసిటీ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, విజయశ్రీ వద్ద యూనియన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు జెండాలను ఆవిష్కరించారు. సిఐటియు నాయకులు రమణ, వెంకట్రావు, పోతినాయుడు, శంకర్రావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని తోటాడ జంక్షన్లో సీఐటీయూ పతాకాన్ని జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అంగన్వాడీ నాయకులు ఆడారి రామలక్ష్మి, జయ, లక్ష్మి, కాంగ్రేగుల రాము పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం మండలంలో పలుచోట్ల సిఐటియు జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, ఈశ్వరమ్మ, సత్యవతి, దేవి, చిరంజీవి, రమణ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని రాంబిల్లి, వెల్చూరు, నేవీగేట్, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడు నాయుడు, వివిధ రంగాల నాయకులు చందక రామకృష్ణ, సేరం రాంబాబు, సుజాత, పి మంగ, అప్పలరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సంఘం జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఈర్లే నాయుడు బాబు, గండి నాయనబాబు, కొత్తపెల్లి గణేష్, కె అప్పారావు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మండలంలోని అడ్డరోడ్డు, వేమగిరి గ్రామాలలో సిఐటియూ జెండాలను ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ ఆధ్వర్యాన ఎగురవేశారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు నాయకులు నాగేశ్వరరావు, త్రిమూర్తులు, అప్పన్న రాజు, గొట్లాలు జోగారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కసింకోట, తాళ్లపాలెం, కొత్తపల్లి క్రెబ్స్ తదితర ప్రాంతాల్లో సిఐటియు పతాకావిష్కరణలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.శ్రీదేవి, బి.సూర్యలక్ష్మి, డిడి.వరలక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని సెజ్, అచ్యుతాపురం, తిమ్మరాజుపేట గ్రామాలలో సిఐటియు పతాకావిష్కరణలు చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కే సోము నాయుడు, సరిగడం రామనాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్ : సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, దంట్ల శివ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలను అవిష్కరించారు. ఈనెల 31 నుంచి జరిగే మహాసభ, వచ్చేనెల 4న మహాప్రదర్శన, ఆర్‌కె బీచ్‌లో బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులయూనియన్ నాయకులు సత్తిబాబు శ్రీను పాల్గొన్నారు

నర్సీపట్నం కృష్ణబజార్ వద్ద. ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో అఖిలభారత మహాసభ సందర్భంగా సిఐటియు పతాకాన్ని ముఠా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ 27 నుంచి 2 వరకు శ్రామిక ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. ముఠా కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె నానాజీ, ఎం. రమణ, నాయుడు, తాతబాబు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

చీడికాడ : మండల కేంద్రంలో చావడి వద్ద సిఐటియు జెండాను యూనియన్ మండల కార్యదర్శి ఆర్ దేమునాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు నాయకులు ఎం జానకి, బి ఉమ, పైడితల్లి ఆటో యూనియన్ నేతలు బి ముత్యాల నాయుడు, ఎస్‌కె.యాసీబు, కొండబాబు పంచాయతీ కార్మిక నేత సన్యాసి నాయుడు పాల్గొన్నారు

నక్కపల్లి : నక్కపల్లిలో నూకతాత ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు పతాకాన్ని యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఇసరపు నాగేశ్వరరావు, పలివెల అప్పారావు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్, గిరి, నాగు,బుజ్జి, ప్రసాద్,నాని, అప్పారావు, వెంకటరావు పాల్గొన్నారు.మండలంలో వేంపాడులో సిఐటియు పతాకావిష్కరణలో సిఐటియు నాయకులు ఎం అప్పలరాజు, ఎం రాజేష్, బి రాము పాల్గొన్నారు.

ములగాడలో మాట్లాడుతున్న ఆర్.లక్ష్మణమూర్తి

నర్సీపట్నంలో కార్మిక జెండావిష్కరణలో ముఠా కార్మికులు

పరవాడలో పాల్గొన్న కోటేశ్వరరావు, గనిశెట్టి, తదితరులు

నక్కపల్లిలో సిఐటియు పతాకావిష్కరణలో నేతలు